జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 19-09-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 128 పేజీలు: 8 వెల : రూ.7

# మాజీ సైనికుల సంక్షేమ కార్పొరేషన్‌కు.. కేబినెట్ ఆమోదం

*** హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు * సైనికులు, వారి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడి * తన ఎన్నికల మేనిఫెస్టో 'జవాన్ డిక్లరేషన్' లో సైతం ప్రత్యేక కార్పొరేషన్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేసిన కేంద్ర మంత్రి**

**శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (వార్త):** దేశం కోసం సరిహద్దుల్లో, ఎన్నో క్లిష్టమైన పరిస్థితుల్లో సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ స్పష్టం చేశారు. మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ కేబినెట్ బుధవారం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. సైనికుల కుటుంబాలకు భరోసా నిలిచేలా జవాన్ మిత్ర అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే జవాన్లకు మద్దతుగా నిలిచేలా దేశంలోనే తొలిసారిగా జవాన్ డిక్లరేషన్ ప్రకటించామన్నారు. సిక్కోలు జిల్లాకు చెందిన మాజీ సైనిక సంఘం (16 విభాగాలు)తో ఈనెల 15న నిర్వహించిన ప్రత్యేక భేటీలో సైతం ప్రత్యేక కార్పొరేషన్ పట్ల స్పష్టమైన హామీ ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సైతం తన యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా.. సీఎం చంద్రబాబు సారథ్యంలో మంత్రివర్గం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలపడంపై ఆనందంగా ఉందన్నారు.

దేశం కోసం సేవ చేస్తున్న సైనికులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏ విధమైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందో ఈ నిర్ణయమే తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సభ్యులకు కేంద్రమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడంతో పాటు జవాన్లకు మరింత మద్దతుగా ఉంటామని భరోసా ఇచ్చారు.








## 20న రాజపురానికి సీఎం చంద్రబాబు రాక

**శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 20న కవిటి మండలం రాజపురం గ్రామంలో పర్యటించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో భాగంగా తొలిసభ జిల్లాలో నిర్వహించనున్నారు. పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టరు, ఎస్పీ, ఉన్నతాధికారులు గురువారం రాజపురం వెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

# సైలాడ క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

*** సామాజిక తనిఖీ ప్రజావేదికలో బయటపడిన అవకతవకలు * అధికారులను నిలదీసిన గాజులకొల్లివలస వేతనదారులు, టీడీపీ నేతలు**

**ఆమదాలవలస, సెప్టెంబరు 18 (వార్త):** ఆమదాలవలస మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కూలీలు సామాజిక తనిఖీ ప్రజావేదికలను అధికారులను నిలదీశారు. బుధవారం ఆమదాలవలస మండల ఉపాధి హామీ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదికను జిల్లా ఉపాధి హామీ ప్రొసిడింగ్ అధికారి స్వరూపారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉపాధి పథకంలో జరిగిన అక్రమాలపై ఆమదాలవలస మండల అధ్యక్షుడు నూక రాజు, జిల్లా కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు, నాయకుడు తమ్మినేని చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. సైలాడ పంచాయతీ ఉపాధి పనుల్లో పలు అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో క్షేత్ర సహాయకుడిని సస్పెండ్ చేశామని, నివేదికను కలెక్టర్‌కు సమర్పించామని ఆయన ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని ఉపాధి హామీ ఏపీడీ లోకేశ్ తెలిపారు. నెల్లిపర్తి గ్రామంలో క్షేత్ర సహాయకుడు పలు అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం తనిఖీల్లో వెల్లడైందని, గ్రామ సభ నిర్వహిస్తే గైర్హాజరయ్యారని, అదేవిధంగా మండల స్థాయి ప్రజా వేదికకు కూడా గైర్హాజరయ్యారని ఆయనకు నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఉపాధి హామీ విజిలెన్స్ అధికారి బి.లవరాజు, సామాజిక ఆడిట్ ఎస్‌ఎంటీ గౌరీశంకర్, ఏపీడీ లోకేశ్, ఏపీవో లక్ష్మీనర్సమ్మ, ఈసీ రాములతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# వంశధార గట్టుకు కోత

*** గండిపడే అవకాశం * వరదొస్తే వణుకు * భయం గుప్పిట్లో కొండరాగోలు, దుర్భలాపురం గ్రామస్తులు * పరిశీలనకే పరిమితమవుతున్న అధికారులు, నేతలు**



**హిరమండలం, సెప్టెంబరు 18 (వార్త):** వంశధార నదికి వరద వచ్చిందంటే చాలు పరివాహక ప్రాంతాల ప్రజలు హడలెత్తుతున్నారు. ఎప్పుడు వంశధార వరద నీరు వచ్చి గ్రామాల మీద పడుతుందోనని సంబంధిత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏటా వంశధారకు వస్తున్న వరద నీటికి గట్టు అంతకంతకు కోతకు గురవుతుంది. పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధుల వద్ద గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారు కరువవుతున్నారు. హిరమండలం మండలంలోని గులుమూరు, కొండరాగోలు, దుర్భలాపురం గ్రామాలతో పాటు ఇతర గ్రామాలు వంశధార నది తీరానికి ఆనుకుని ఉన్నాయి. గులుమూరు పంచాయతీ పరిధిలో రాజుగారి తోట నుంచి కొండరాగోలు దుర్గమ్మ గుడి వరకు సుమారు కిలోమీటరు పొడవునా వంశధార నది గట్టు పూర్తిగా కోతకు గురైంది. గట్టిగా వరదలు సంభవించినట్లయితే గట్టు దిగువఉన్న కొండరాగోలు, దుర్భాలాపురం గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. సుమారు కిలోమీటరు పొడవునా గట్టు పటిష్టవంతం చేసేందుకు రక్షణగోడ నిర్మాణం చేపట్టాలని సంబంధిత గ్రామస్తులు కోరుతున్నారు. దీంతో పాటు గొట్టాబ్యారేజి దిగువన గొట్టాబ్యారేజి - హిరమండలం వైపుకు వెళ్లే రహదారిలో గత మూడేళ్ల క్రిందట గట్టు పూర్తిగా కొట్టుకుపోయింది.వాటిని సంబంధిత జిల్లా అధికారులు పరిశీలించినా నేటి వరకు పూడ్చలేదు.



## అసాంఘిక కార్యకలాపాలు అరికట్టండి



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త) : గొట్టిపల్లి శివాలయం బ్యాక్ సైడ్ కాలనీలో బాగా రెల్లగడ్డి పెరిగిపోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రిపూట మందు బాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఈ గడ్డి తయారైందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రెల్ల గడ్డిని తొలగించాలని, మందుబాబులను అరికట్టి, అసాంఘిక కార్యకలపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# స్వయం సహాయక సంఘాల బలోపేతం

■ ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, సెప్టెంబరు 18(వార్త): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. బుధవారం ఆమె మెప్మా ఎండీ తేజ్‌భరత్‌ను విజయవాడలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పలాస నియోజకవర్గానికి సంబంధించి స్వయంసహాయక సంఘాల పనితీరును వివరించారు. ఆర్పీల జీతభత్యాల అంశాన్ని ప్రస్తావిస్తూ, అందులోని సాంకేతిక సమస్యలను త్వరితంగా పరిష్కరించాలని కోరారు. పలాస నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్దాన ప్రాంతముందని, ఇక్కడ లభించే ముడి సరుకుతో కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు డ్వాక్రా సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అందుకనుగుణంగా అదనపు రుణ సదుపాయాన్ని కల్పించాలని, ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.



# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి




కంచిలి, సెప్టెంబరు 18(వార్త): స్వచ్ఛతే హీ సేవలో భాగంగా కంచిలి మండలంలో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు జోరుగా సాగాయి. జాడుపూడిలో ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**చీడిపూడిలో**

**సారవకోట:** సారవకోట మండలం చీడిపూడి గ్రామంలో స్వచ్ఛతే హీ సేవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, బహిరంగ మూత్ర, మల విసర్జన వలన కలిగే నష్టాలను గ్రామస్థులకు తెలియజేశారు.

కార్యక్రమంలో జనసేన నాయకుడు వరుదు రామ్‌శేఖర్, సచివాలయ, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



# వినాయక లడ్డూల వేలం



పాతపట్నం, సెప్టెంబరు 18(వార్త): పాతపట్నం పరిధిలోని కోటగుడ్డి కాలనీలో వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. అదే వీధికి చెందిన ఆదాడ అప్పలనాయుడు రూ.78 వేలకు వినాయకుని లడ్డూని కైవసం చేసుకున్నారు. అనంతరం మండపంలో వినాయకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, డప్పులు, మేళతాళాలు, నృత్యాలతో సందడి చేస్తూ ఘనంగా మహేంద్రతనయ నదీ తీరంలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో కోటగుడ్డి కాలనీ వాసులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూ వేలంపాట బుధవారం నిర్వహించగా రూ.99,002లకు మజ్జి తిరుపతిరావు కైవసం చేసుకున్నారు. ఈ లడ్డును కమిటీ సభ్యులు వారికి అందజేశారు.

**ఇచ్ఛాపురం:** బెల్లుపడ అచ్చంపేటలోని కుమారస్వామి గణపతి మండపంలో లడ్డు వేలంపాటలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన వేలంలో గిన్ని రంగయ్య రూ.63 వేలకు పెద్ద లడ్డూను, బుడ్డేపు చిరంజీవి రూ.44 వేలకు చిన్న లడ్డూను సొంతం చేసుకున్నారు.

## కవి సమ్మేళనం పుస్తకావిష్కరణ

గార, సెప్టెంబరు 18(వార్త): ఆడవరం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు, తెలుగు కవి భోగెల ఉమా మహేశ్వరరావు.. గిడుగు వ్యవహారిక భాషా కవి సమ్మేళనం అనే పుస్తకావిష్కరణ చేశారు. తనతో పాటు రాష్ట్రంలోని వివిధ తెలుగు కవులు రచించిన కవితలను ఈ పుస్తకంలో తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన రచయిత వైరాగ్యం ప్రభాకర్ పొందుపరిచినట్లు ఆయన తెలిపారు.






## కంచమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి విరాళాలు

కంచిలి, సెప్టెంబరు 18(వార్త) : కంచమ్మ తల్లి దేవస్థాన నూతన మండప అభివృద్ధికి తమ వంతు సహాయాన్ని దాతలు అందిస్తున్నారు. కంచిలికి చెందిన కనకాల సత్యనారాయణ తన కుమారుడు జ్యోషిక్ పేరున రూ.15000 విరాళంగా బుధవారం ఇచ్చారు. సోంపేట వాస్తవ్యులు కొంచాడ మోహనరావు రూ.90 వేలు, కంచమ్మ తల్లి వెజిటబుల్స్ ప్రొప్రైటర్ గిరి రూ.16,999లు, భైరిపురానికి చెందిన లింగం మోహనరావు రూ.15 వేల విరాళం అందజేశారు. ఆ మండపం అభివృద్ధికి ఈ నిధులను సమీకరిస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించిన అబ్జర్వర్స్



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త): ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్‌ను సాల్ట్ అబ్జర్వర్ నాగరాజు, సూర్యనారాయణ సందర్శించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## 25న జలుమూరు మండల సమావేశం

జలుమూరు, సెప్టెంబరు 18(వార్త): జలుమూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 25న నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. దీనికి సంబంధించి ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించామన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశంలో పాల్గొనాలని ఆదేశించారు.

## వాటర్ ప్యూరిఫైయర్ బహుకరణ



జలుమూరు, సెప్టెంబరు 18(వార్త) : కరవంజ ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులకు సురక్షిత తాగునీరందించేందుకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అనే ఎన్జీవో సంస్థ తాగునీటి ప్యూరిఫైయర్‌ను బహుకరించింది. దీని విలువ సుమారు మూడు లక్షల రూపాయలు ఉంటుంది.

## కళ్లపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త) : వీఎన్ పురం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు బుధవారం కంటి వైద్యులు డా.వీబీవీ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కంటపైన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏ విటమిన్ ఉండే ఆహార పదార్థాలు రోజూ తినేటట్లు చూసుకోవాలన్నారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
శ్రీకాకుళం

# వివాహిత ఆత్మహత్యాయత్నం



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త): నరసన్నపేట మండలంలోని దూకులపాడు పంచాయతీ తండ్యాలవానిపేటకు చెందిన శిమ్మ దివ్య అత్తింటి వేధింపులు కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు హుటాహుటిన నరసన్నపేటలోని ఓ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి మంగళవారం రాత్రి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

దీనిపై ఆమె తల్లి ఆదిలక్ష్మి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వినాయకుడికి 1108 లడ్డూల నివేదన



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త) : నరసన్నపేట తిరుమల వీధి వద్ద ఉన్న శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించామని ప్రధానార్చకులు భాస్కరభట్ల జగదీష్‌శర్మ తెలిపారు. 1108 లడ్డూలు స్వామి వారికి నివేదించామన్నారు. స్థానిక భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

## నేడు మండల స్థాయి ఆటల పోటీలు



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త) : ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాల, బాలికలకు పలు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు పాంశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, పీఈటీలు సమక్షంలో జరుగుతాయన్నారు.

## 'ఆక్రమణలపై దృష్టి సారించండి'



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త) : నరసన్నపేట మండలం బొరిగివలస పంచాయతీ ప్రభుత్వ భూముల ఆక్రమణలు కొనసాగుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సభ్యుడు నేత తంగి తారక్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వంశధార కాలవ గట్లు, చెరువులు సైతం ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## 30న పంటల నమోదు తుది జాబితా



సారవకోట, సెప్టెంబరు 18(వార్త) : సారవకోటలో ఇటీవల నిర్వహించిన ఈ పంట నమోదు ప్రక్రియ సుమారుగా 70 శాతం పూర్తయిందని వ్యవసాయ శాఖ అధికారి వెంకటరావు తెలిపారు. ఈనెల 23వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నా మన్నారు. ఈనెల 25 నుంచి 27వ వరకు సామాజిక తనిఖీ నిర్వహిస్తామ న్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే 28, 29 తేదీల్లో తెలియ జేయాలని సూచించారు. తుదిజాబితా 30న విడుదల చేస్తామన్నారు.

## గోరువాని చెరువు.. అధ్వానం



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త): నరసన్నపేట సంతతోట వద్ద ఉన్న గోరువానిచెరువు మురికి కూపంగా దర్శనమిస్తుంది. గతంలో ఈ చెరువు అభివృద్ధికి స్థానికులతో పాటు పంచాయతీ వార్డు సభ్యులకు కూడా ముందుకు వచ్చి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అనంతరం దీని నిర్వహణ బాధ్యతను గాలికి విడిచిపెట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును బాగు చేయాలని వారు కోరుతున్నారు.

# తల్లీ,బిడ్డల ఆరోగ్యం జాగ్రత్త



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త): తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని నాగమణి తెలిపారు. బుధవారం చిన్న కరగాం అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ బావాజీనాయుడు ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**సారవకోట:** సారవకోట మండలం చీడిపూడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-1, కేంద్రం-2లో బాలామృత వారోత్సవాలు నిర్వహించారు. 15 రకాల పిండివంటలను స్వయంగా తయారుచేసి వాటి ప్రయోజనాలు పిల్లల తల్లులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిక్కు వెంకట కృష్ణారావు,జనసేన నాయకుడు వరుదు రామ్‌శేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రం, సచివాలయం, ఎంపీపీ పాఠశాల సిబ్బంది, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సొంత ఇళ్లెప్పుడిస్తారు?

■ గుప్పిడిపేట అగ్నిప్రమాద బాధితుల ఆవేదన

నరసన్నపేట, సెప్టెంబరు18(వార్త): పోలాకి మండలం గుప్పిడిపేట గ్రామంలో 2022 నవంబర్‌లో జరిగిన అగ్నిప్రమాదంతో 25 గృహాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఆనాడు కట్టుబట్టలతో మిగిలిన బాధితులను పరామర్శించిన నేతలు, అధికారులు పక్కా ఇళ్ల నిర్మాణానికి హామీ ఇచ్చి మర్చిపోయారు. ప్రస్తుతం చిన్న, చిన్న పురిపాకల్లో నివాసాల ఏర్పరచుకుని విష సర్పాల మధ్య సహజీవనం చేస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.




# పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (వార్త): ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో స్వచ్ఛతే హీ సేవలో భాగంగా బుధవారం హాస్పిటల్ రోడ్డులోని మున్సిపల్ గ్రంథాలయ ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించి, మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఉపేంద్రకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అఖిల్ మనోహర్, సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## 23 లోగా పంట నమోదు చేసుకోవాలి



నరసన్నపేట, సెప్టెంబరు 18 (వార్త) : పంట నమోదు ప్రక్రియ ఈ నెల 23తో ముగియనున్నదని ఏవో సునీత బుధవారం తెలిపారు. రైతులందరూ పంట నమోదు వేలి ముద్ర, పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు పంట నమోదు సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే 29 లోపు తెలపాలన్నారు. 30న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

## అన్న సమారాధనలో స్వాతీశంకర్



గార, సెప్టెంబరు 18(వార్త): గార మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీశంకర్ పాల్గొన్నారు. బందరువానిపేటలో దుమ్ము వీధిలో, కళింగపట్నం పంచాయతీ కంద్ర వీధి, దీపావళిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమాల్లో గార మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం




బూర్జ, సెప్టెంబరు 18(వార్త): స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం లబిస్తుందని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు తెలిపారు. స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛతే హి సేవా కార్యక్రమంలో భాగంగా ఓవీ పేటలో బుధవారం చేపట్టిన స్వచ్ఛత రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన స్వచ్ఛతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ అమ్మాజమ్మ మాట్లాడుతూ పరిశుభ్రతపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తద్వారా ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు, స్థానిక పంచాయితీ కార్యదర్శి ఉమాకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ పొన్నాడ త్రినాథరావు, సచివాలయ, వైద్య, పశుసంవర్ధక సిబ్బంది, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఆటల పోటీలు ఆరంభం





పలాస, సెప్టెంబరు 18(వార్త): పాఠశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల ఆటలు పోటీలు బుధవారం బొడ్డపాడులో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల స్థాయిలో అండర్-14, అండర్-17 బాల, బాలికల కబడ్డీ, వాలీబాల్ ఎంపికలు జరిపారు. ప్రధానోపాధ్యాయుడు వీర్రాజు, పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు తవిటయ్య, రాంజీ, పద్మాలోచన, పలాస మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్‌రామ్‌నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గర్ధం తులసీరావు, మురుపింటి కుమార్‌రాజ్, మురుపింటి ఖగేష్, విష్ణు, పురుషోత్తం, భాస్కరరావు, కామేష్, వెంకట్, రాజాం శ్రీనివాస్, తామాడ రామారావు, రాజాం పద్మ, ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు తెప్పల చిట్టి, తామాడ క్రాంతి, బొడ్డు జగన్, గర్ధం ఈశ్వర్ రావు, పోతనపల్లి మల్లి, మద్దిల ధర్మా రావు, బత్తిని వాసు, రాజాం జానకీరావు, నౌగపు గంగాధర్, బైనపల్లి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయానికి స్టేషనరీ జనసేన నేత వితరణ

భామిని, సెప్టెంబరు 18(వార్త): నులకజోడు గ్రామ సచివాలయ సిబ్బందికి జనసేన పార్టీకి చెందిన కర్రి ఢిల్లేశ్వర్‌రావు తన సొంత నిధులతో వివిధ స్టేషనరీ వస్తువులను బుధవారం వితరణగా ఇచ్చారని పాలకొండ నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి నిమ్మల నిబ్రం తెలిపారు. సచివాలయంలో విధుల నిర్వహణకు అవసరమైన పేపర్ బండిల్స్, వివిధ రికార్డులు తదితరాలు అందించామన్నారు. భామిని మండల అధ్యక్షుడు రుంకు కిరణ్‌కుమార్, చందు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.





## అరసాడ వీఆర్ఏ ఆకస్మిక మృతి

వంగర, సెప్టెంబరు 18(వార్త): వంగర మండలంలోని అరసాడ వీఆర్ఏ ధర్మాన ఆదయ్య బుధవారం ఆకస్మికంగా మరణించారు. ఇటీవల కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. జిల్లా వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు ఎజ్జల అప్పలస్వామి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయనకు ప్రభు త్వం నుంచి రావలసిన గ్రాట్యుటీ, మట్టి ఖర్చులు తదితరాలు సంబంధిత అధికారులతో మాట్లాడి అందేటట్లు చూస్తానని ఆయన కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

## అక్రమ గ్రావెల్ తవ్వకాల పరిశీలన

భామిని, సెప్టెంబరు 18(వార్త): బురుజోల మెట్ట వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న స్థలాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మైనింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇష్టాను సారంగా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని గుర్తించారు. గ్రావెల్ తరలిస్తున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేయాలని మండల రెవెన్యూ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.



## జలుమూరు ప్రత్యేక అధికారిగా లోకనాథం



జలుమూరు, సెప్టెంబరు 18(వార్త): జలుమూరు మండల ప్రత్యేక అధికారిగా మంద లోకనాథంను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానన్నారు.

## భోజన పథకాన్ని తనిఖీ చేసిన ఎంఈవో



నరసన్నపేట, సెప్టెంబరు 18(వార్త): ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పిల్లలకు రుచికరంగా, సులభంగా జీర్ణమయ్యేలా ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కిన్నెరవాడలో భక్తి శ్రద్ధలతో గోమాత పూజ

సారవకోట, సెప్టెంబరు 18(వార్త): కిన్నెరవాడలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అర్చకులు సిద్ధయ్యస్వామి ఆధ్వర్యంలో బుధవారం భక్తి శ్రద్ధలతో గోమాత పూజలు నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని ఈ పూజలు చేశామని ఆయన తెలిపారు.



జాతీయ

శ్రీకాకుళం

## టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో చోరీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 18 (వార్త):** పట్టణ పోలీసు స్టేషన్‌కి కూత వేటు దూరంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ముడియా వీధి పక్కన గల కోరాడ కిశోర్ బ్యాగ్‌ల షాప్‌లో అగంతకులు దొంగతనానికి పాల్పడ్డారు. 25 వేల రూపాయల నగదు చోరీకి గురికాగా, పక్కనే ఉన్న కాళ్ళ వెంకటేష్ చెప్పుల షాప్, డైలీ మార్కెట్ జంక్షన్ వద్ద మరో షాప్ లో కూడా చోరీకి విఫలయత్నం చేశారు. వినాయక ఊరేగింపు వెళ్లిన కొద్ది సేపటికే చోరీ జారీ జరిగినట్లు సి సి కెమెరాలో దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. సీఐ చిన్నం నాయుడు, సంఘటన స్థలాలు పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది.

# సీఎం సహాయనిధికి రూ. 3.05 లక్షలు

***మంత్రి లోకేష్‌కు చెక్కులను అందజేసిన పలాస ఎమ్మెల్యే గౌతు శివాజి**



**పలాస, సెప్టెంబరు18 (వార్త):** విజయవాడలో వరదలు మిగిల్చిన నష్టాల నుంచి తేరుకుని, అక్కడ సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ముఖ్య మంత్రి సహాయనిధికి రాష్ట్ర వ్యాప్తంగా పలు వర్గాల ప్రజల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్‌కు పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష విజయవాడలో కలిసి రూ.3.05 లక్షల విలువైన చెక్కులను బుధవారం అందజేశారు. ఇప్పటికే ఆమె పిలుపు మేరకు రాష్ట్రంలోని పలువురు ఇండస్ట్రియలిస్టులు సీఎం సహాయనిధికి పెద్దమొత్తంలో విరాళాలు అందజేశారు. ఎమ్మెల్యే శిరీష తన గౌరవ వేతనాన్ని విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్య మంత్రి సహాయనిధికి అందించారు. అయితే పలాసలోని ఎస్‌ఎస్‌ఎస్ ఇంటర్నేషనల్ అనే జీడి పరిశ్రమ, పీబీ కనస్ట్రక్షన్ మెటీరియల్‌లు ఒక్కో రూ. లక్ష చొప్పున అందజేశారు. అలాగే పలాస కాష్యూల్యాండ్ లయన్స్‌క్లబ్ వెల్ఫేర్ సొసైటీ రూ. 70వేలు అందించగా, యెరుకోల సత్యారావు అనే వ్యాపారి రూ. 25వేలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఇదిలా ఉండగా, ఎనిమిదో తరగతి చదువుతున్న కె.రుచిత అనే చిన్నారి తోటివారిని ఆదుకోవాలనే తపనతో రూ.10వేలు అందించినట్లు మంత్రి లోకేష్‌కు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వివరించారు.

## వర్షం.. ఉపశమనం



**హిరమండలం, సెప్టెంబరు18 (వార్త):** ఉదయం ఎండ వేడిమి, సాయంత్రం వర్షం పడటంతో ఉపశమనం పొందారు మండలవాసులు. బుధవారం ఉదయమంతా ఎండ వేడిమితో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం సరికి ఆకాశం మేఘా వృతమై వర్షం కురియటంతో ఉపశమనం పొందారు. వేసవి కాలంలో మించిన ఎండలు కాస్తున్నాయి.

# బెంతుల సమస్యలు పరిష్కరించండి

*** 270 రోజులుగా దీక్షలు చేపడుతున్నారు * వారిని పిలిపించి.. మాట్లాడండి * గానోడెర్మాకు పరిష్కారం చూపండి.. లేకుంటే కొబ్బరి అంతరించిపోయే ప్రమాదం * బీల ముంపు నుంచి రక్షణకు శాశ్వత పరిష్కారం కనుక్కోండి * నియోజకవర్గంలో రహదారులు అద్వానం * కంచిలిలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి * ప్రజా సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్సీ నర్తు రామారావు వినతి**



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 18 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని ప్రజా సమస్యలపై పరిష్కారాన్ని కోరుతూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను, స్థానిక శాసనమండలి సభ్యులు నర్తు రామారావు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు నియోజకవర్గం లోని అత్యంత ప్రధానమైన ఐదు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, వాటి నష్టాలను కలెక్టర్‌కు వివరించారు. ప్రాధాన్యత క్రమంలో కాకుండా అత్యవసరమని భావించి ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమరి ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమకూర్చాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కలెక్టర్ ముందు ఏ కరువు పెట్టారు. కలెక్టర్ కు ఆయన విన్నవించిన సమస్యలను పరిశీలిస్తే...

ఏ నియోజకవర్గంలోని బెంతొరియా సామాజిక వర్గ%శీ% గడిచిని 20 ఏళ్లుగా తమ రిజర్వేషన్ల కోసం అలుపెరగని పోరాటాన్ని చేపడుతున్నారు. చివరకు కవిటి మండల కేంద్రంలో గడిచిన 270 రోజులుగా రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నారు. ఆయా సామాజిక వర్గ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపించాల్సిందిగా ఎమ్మెల్సీ రామారావు విజ్ఞప్తి చేశారు.

ఏ ఉద్దానం ప్రాంతంలో గ్యానోడెర్మా అనే శిలీంద్రం కొబ్బరి అంతాన్ని చూస్తోందని, ఆ వ్యాధి నివారణ చర్యలు చేపట్టే విధంగా ఉద్యాన శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇప్పటికే ఒకవైపున కాయల దిగబడి పడిపోగా, మరోవైపున కిడ్నీ వ్యాధితో ఉద్దానం ప్రాంతం పోరాటం చేస్తూ ఆర్థికంగా చితికిపోయిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులలో ఉద్దాన ప్రాంతాన్ని రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యపై గతంలో వార్తలు ప్రచురించిన పత్రిక కథనాలను జోడించారు.

ఏ ఇటీవల ఏర్పడిన వాయుగుండం కారణంగా బీల ప్రాంతంలో వ్యవసాయమంతా ముంపునకు గురైంది. సుమారు నాలుగు రోజులపాటు వరదలు వరి పొలాలు ఉండిపోవడంతో మొత్తం కుళ్ళిపోయిందని కలెక్టర్ కు ఇచ్చిన నివేదికలో నర్తు రామారావు పేర్కొన్నారు. ఒక ఎకరం పంట సాగుకు ఇప్పటికే దాదాపు 15 వేల రూపాయల వరకు రైతులు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ పరిస్థితుల్లో వందలాది ఎకరాల్లో పంట కుళ్ళిపోయిందని, ఆయా పొలాలను పరిశీలించి నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం తరపున ఆదుకోవాలని విన్నవించారు.

ఏ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ ద్వారా జిల్లా శివారులోని ఇచ్ఛాపురం నియోజక వర్గానికి ఏమాత్రం మేలు జరగడంలేదని తెలిపారు. ఇసుక రీచ్ లో అన్ని జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉండడం కారణంగా, దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇచ్ఛాపురానికి ఇసుక చేరాలంటే రవాణా చార్జీలు అధికమవుతున్నా యని తెలిపారు. సాంకేతికంగా ఈ సమస్యకు పరిష్కారంగా కంచిలి మండల కేంద్రానికి సమీపంలో ఎక్కడైనా ఇసుక డంపింగ్ పాయింట్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే దాదాపు ఒక టన్నుకు అదనంగా 800 రూపాయలు ఖర్చు గత ప్రభుత్వంతో పోల్చితే అవుతుందని కలెక్టర్కు వివరించారు.

ఏ నియోజకవర్గంలో రహదారులు అద్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా సోంపేట, ఎమ్మెస్ పల్లి మోడల్ స్కూల్ లకు పోవాలంటే నరకయాతన అంటూ ఆయా పాఠశాలలకు వెళ్లే రహదారుల చిత్రాలను కలెక్టర్ ముందు ప్రదర్శించారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఈ గుంతలతో, వర్షాలు పడేటప్పుడు వాటిలో నిలిచిన నీరుతో చాలా ఇబ్బందులు పడుతున్నట్టు కలెక్టర్ కు వివరించారు. ముఖ్యంగా పలు గ్రామీణ రహదారులు, ఒడిస్సా ఆంధ్ర సరిహద్దు రహదారులు నరకానికి నకలుగా మారాయని స్పష్టం చేశారు. ప్రధానంగా ఈ ఐదు సమస్యలపై ప్రభుత్వం స్పందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను శాసన మండల సభ్యులు నర్తు రామారావు విన్నవించారు. తను అందించిన సమస్యల వినతి పత్రంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి తనువంత కృషి చేస్తానని తెలిపినట్టు వార్త ప్రతినిధికి ఎమ్మెల్సీ తెలిపారు.



## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

**వంగర, సెప్టెంబర్ 18(వార్త):** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది, ఎంతో మంది విద్యార్థులను ఉత్తను పౌరులుగా తీర్చి దిద్దిన ఘనత ఉపాధ్యాయులకు దక్కుతుందని వక్తలు అన్నారు. వంగర మండల కేంద్రంలో వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణలో విశ్రాంత ఉపాధ్యాయులు మాచర్ల హరి నారాయణ మాస్టారు. మర్రాపు అప్పలస్వామి మాస్టార్లను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ వంగర మండలం కొప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని సంవత్సరాల కిందట హరినారాయణ మాస్టారు, అప్పల స్వామి మాస్టారు లు ఉత్త భోధన పద్ధతులు ఉపయోగించి బోధన చేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో వివేక్ మాస్టర్ మైండ్స్ ఉపాధ్యాయ సిబ్బంది చక్రపాణి, ఈశ్వరరావు, నేతాజీ, రమేష్, హరిబాబు, శంకర్రావు, విశాలాక్షి జ్యోతి, అరుణ, పద్మ పాల్గొన్నారు


## ఉత్తమ ఉపాధ్యాయుడు జయకృష్ణకు సన్మానం




వంగర జడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, రచయిత జయకృష్ణను బుధవారం ఏ.వి.పురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసరావు, గుళ్ళ సీతారాంపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం

**టీడీపీ శ్రీకాకుళం నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్**



**శ్రీకాకుళం సెప్టెంబర్ 18 (వార్త):** వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన భారీ నష్టాలకు, అదే రీతి లో భారీ నష్ట పరిహారం ప్యాకేజీ ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు కష్టాలు, కన్నీళ్ళు కనిపించకుండా, కష్టించే పాలకుడు, నిరంతర శ్రామికుడు, అలుపెరిగిన పోరాట యోధుడు ఇచ్చిన మాట నిలబట్టుకునే నిజమైన నిస్వార్థ పాలకుడని అన్నారు. వరద ప్రాంతాలలో నష్టపోయిన ప్రతి ఒక్కరికి, ప్రతి ఇంటికి భారీ ప్యాకేజ్ సహాయం ప్రకటించి ఆదుకున్నారని తెలిపారు. వరద బాధితుల సహాయార్థం రాష్ట్రంలో అన్నివర్గాల వారు కూటమి ప్రభుత్వం పిలుపు మేరకు నమ్మకం, విశ్వాసంతో సుమారు మూడు వందలు కోట్లు మేర విరాళాలు అందించడం జరి గిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కూడా కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ, ప్రజలు ఇచ్చిన అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ విలువైన ప్రతిక్షణం ప్రజల కోసమే పాటుపడుతూ పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని నిరూపించుకుందని మాదారపు వెంకటేష్ అన్నారు.

## సాంఘీక శాస్త్రంపై అవగాహన అవసరం

**హిరమండలం, సెప్టెంబరు 18 (వార్త):** విద్యార్థులకు సాంఘీక శాస్త్రంపై అవగాహన అవసరమని ఎంఈవో కె.రాంబాబు సూచించారు. బుధవారం మండల కేంద్రం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్రంపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి మానవ విలువలు,పెద్దలను గౌరవించడం, రాజకీయ చరిత్రలు భూగోళశాస్త్రం, పౌరశాస్త్రం వంటి సబ్జెక్టలపై విధిగా పట్టు ఉండాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టి.కేశవ రావు, డిఆర్‌పీలు జి.శంకర్‌నారాయణ, ఉమామహేశ్వరరావు, పి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## మూడు గంటలు.. చీకట్లో సంతబొమ్మాళి

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 18 (వార్త):** సంతబొమ్మాళి మండల కేంద్రం దాదాపు మూడు గంటలు పాటు అంధకారంలో ఉంది. సాయంత్రం 7గంటల నుంచి దాదాపు 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు స్థానికంగా ఉండక పోవడంతో సరఫరాను సరిచేసే వారు లేకుండా పోయింది. తరచూ మండల కేంద్రంలో ఇదే పరిస్థితి నెలకొంటోందని వినియోగదారులు విద్యుత్ శాఖాధి కారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై సంత బొమ్మాళి మండలం ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు మీడియా ప్రతినిధులతో పాటు స్థానికులు ఫోన్ చేసినా స్పందించలేదు. ఇకనైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సంతబొమ్మాళి మండల కేంద్రంలో ఏఈ నుంచి కింది స్థాయి సిబ్బంది ఉండేలా చూడాలని లేకుంటే సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని వినియోగదారులు హెచ్చరించారు.



### ఐఐఐటీ నూతన రిజిస్ట్రార్‌గా
## ఆచార్య అమరేంద్ర కుమార్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 18(వార్త):**రాజీవ్ గాంధీ యూని వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య అమరేంద్ర కుమార్ ను ఆర్జియుకేటి డైరెక్టర్ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ అభినందించారు. ఈ కార్య క్రమంలో క్యాంపస్-2 ఇంచార్జీ సాగర్, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, క్యాం పస్-3 ఇంచార్జి సతీష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు.

## 20న విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 18 (వార్త):** విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం, మూడవ శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వినతుల స్వీకరణ జరుగుతుందని సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ



**టెక్కలి, సెప్టెంబర్ 18 (వార్త):** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజా రవాణా శాఖ టెక్కలి డిపోలో బుధవారం అసిస్టెంట్ మేనేజర్ బి యస్‌యన్ మూర్తి పరిసరాలు పరిశుభ్రతపై కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం కాంప్లెక్స్ ఆవరణలోని మొక్కలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. గాంధీ జయంతి వరకు చేపట్టే ఈ కార్యక్రమం, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్, గ్యారేజ్ ఆవరణలను ఉద్యోగులతో కలిపి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంచార్జ్ ఎం రామారావు, సెక్యూరిటీ బ్రాంచ్ ఇంచార్జ్ శ్రీధర్, అసోసియేషన్ నాయకులు జి యన్ భూషణం, ఎస్ ఆర్ కుమార్, మురళి, బి మన్మధరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యాభివృద్ధి తల్లిదండ్రుల బాధ్యత
### పేరెంట్స్ కమిటీ చైర్మన్ అల్లు భాస్కరరావు

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 18(వార్త):**ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్య నభ్యసించి ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లి దండ్రులు కూడా భాగస్వాములు కావాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ అల్లు భాస్కరరావు అన్నారు. సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ముందుగా కొంతమంది పేరెంట్స్ పిల్లలు చదువు, మధ్యాహ్న భోజనం క్రమశిక్షణ తదితర సమస్యలను సమా వేశంలో ఉపాధ్యాయులకు తెలియజేశారు. మాకు కేటాయించిన సమయం కాకుండా అదనంగా తరగతులు పెట్టి చదువు చెబుతున్నామని అందుకే ఈ ఏడాది పదో తరగతి రిజల్ట్ నిదర్శనమని హెచ్ఎం కామరాజు చెప్పారు. పాఠ శాలకు మౌలిక సదుపాయాలు కోసం మంత్రి అచ్చెన్నాయుడు తో చర్చించి దశలు వారిగా సమాకుర్చుతామని కమిటీ సభ్యులు ఉపాధ్యాయులకు తల్లిదం డ్రులకు తెలిపారు. ఈ సమావేశంలో చైర్మన్ తో పాటు వైస్ చైర్‌పర్సన్ తంగి ఉమా, యువకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### గంజాయి, ఇసుక..
# అక్రమ రవాణా అరికట్టండి

* ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి * పైడిభీమవరం చెక్‌పోస్టు, జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ తనిఖీ



**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్18 (వార్త):** ఇతర విభాగాల సమన్వయంతో సరిహద్దు చెక్ పోస్టు వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, గంజాయి, ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న అంతర్ జిల్లాల సరిహద్దు గల పైడిభీమవరం చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు ట్రాఫిక్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులతో మాట్లాడుతూ అదనపు సిబ్బంది, అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా వాహనాలు తనిఖీలు నిర్వహించాలన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ 24 గంటల పాటు ప్రతి వాహనాన్ని తరచుగా తనిఖీ చేయాలన్నారు. అనంతరం జేఆర్‌పురం సర్కిల్ కార్యాలయంలో ఉన్న ముఖ్యమైన రికార్డులు నిర్వహణ, కేసులు దర్యాప్తు వివరాను ఎస్పీ ఆరా తీశారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీలు చేపట్టి మద్యం, గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు, పాటించవలసిన నిబంధనలపై వాహన చోదకులకు విస్తృతంగా అవగాహన కల్పించి, ద్విచక్ర వాహన చోదకులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై జరిమానలు విధిస్తూ ప్రతి ఒక్కరు భద్రత నియమాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ వివేకానంద్, సీఐలు అవతారం, ఈమైనాల్ రాజు, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

### భోగాపురం ఇక అల్లూరి సీతారామరాజు
# అంతర్జాతీయ విమానాశ్రయం

*విమానాశ్రయం పేరు మార్పునకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం * మన్యం వీరుడికి దక్కిన గౌరవం * హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, సెప్టెంబర్18 (వార్త):**ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పేరు మార్పునకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. స్వాతంత్ర సమరయోధులు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు మీద భోగాపురం విమానాశ్రయం ఇక మార్చడంపై కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆయనకు మనం ఇచ్చే నివాళి అని అభివర్ణించారు. గడువు ప్రకారం డిసెంబర్ 2026కి పూర్తి అవ్వాల్సిన విమానాశ్రయాన్ని ఆరు నెలల ముందే అంటే జూన్ 2026 కల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని మరొకసారి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయాలలో ఒకటిగా అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు.

## సంఘ సభ్యత్వానికి సంప్రదించండి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 18 (వార్త):** సంఘ సభ్యత్వం కోసం మీ పరిధిలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాలను సంప్రదించాలని చేనేత జౌళి శాఖ సహాయ సంచాల కులు సిహెచ్ సాయి ప్రసాద్ అన్నారు. ఈనెల20లోగా సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం ఉన్న వారికి సదుపాయాలు లభ్యమవుతా యన్నారు. జిల్లాలో నూతన ప్రాథమిక చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడానికి కనీసం 30 మంది సభ్యులు ఒకే ప్రాంతములో నివాసము ఉన్నట్లయితే శ్రీకాకుళం జిల్లా చేనేత జౌళిశాఖ అధికారిని సంప్రదించా లన్నారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే
# పరిశుభ్రత సాధ్యం

* 2 వరకూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
* బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు
* అర్బన్ పీహెచ్‌సీలో స్వచ్ఛత కార్యక్రమం



**శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (వార్త):** ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం సాధ్యమని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బీజేపీ శ్రేణులతో కలిసి శుభ్రం చేశారు. ఆసుపత్రి ఆవరణలోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించవచ్చన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు వచ్చేనెల 2 వరకూ కొనసాగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సేవాహి సంఘటన జిల్లా కో కన్వీనర్ గుజ్జల రాజు వెంకట్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేడాడ సూర్యకుమారి, శ్రీకాకుళం కో కన్వీనర్ రావాడ పురుషోత్తం, పాతపట్నం సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దన్నాన మదన్ మోహన్, ప్రవీణ్, సంతోష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413